నేటి నుంచి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 19వ తేదీ సోమవారం నుండి ఐదు రోజులపాటు పాడేరు డివిజన్ పరిధిలో 35 సంవత్సరాలు దాటిన వారికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్లకు సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నిర్వహిస్తున్న ఈ స్క్రీనింగ్ పరీక్షలకు వారితో పాటు 35 సంవత్సరాలు దాటిన ప్రజలు కూడా పరీక్షలు చేయించుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈనెల 19వ తేదీన అరకు ఏరియా ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తారని, 20, 21 తేదీలలో పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, 23వ తేదీన చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. 22వ తేదీన చింతపల్లి మండలం కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించి ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని కలెక్టర్ వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టరేట్‌కు కొత్త భవన నిర్మాణమెప్పుడో?

- స్థల పరిశీలనకే పరిమితం- వైటిసి భవనం నుంచే పరిపాలన- రెండేళ్లుగా ఇదే పరిస్థితి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పరిపాలనా సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలు ఏర్పాటు చేశామని, ఇక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని గత వైసిపి ప్రభుత్వం చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. కొత్త జిల్లా ఏర్పడి రెండేళ్లవుతున్నా నేటికీ నూతన కలెక్టరేట్‌కు నోచుకోలేదు. కేవలం స్థల పరిశీలన చేసి వదిలేశారే తప్ప పనులకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో, గతంలో యూత్ ట్రైనింగ్ సెంటర్ కోసం నిర్మించిన భవనంలోనే కలెక్టరేట్‌ను నిర్వహిస్తున్నారు.

గత ప్రభుత్వం 2022 ఏప్రిల్ 4న నూతన జిల్లాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కొత్తగా అవతరించింది. ఈ జిల్లా పరిధిలో పాడేరు, రంపచోడవరం, అరకు నియోజక వర్గాలు ఉన్నాయి. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో 22 మండలాలు ఉన్నాయి. నూతన జిల్లా ఏర్పడిన తర్వాత కలెక్టరేట్‌కు భవనం కరువైంది. దీంతో, పాడేరు చివరలో వైటిసి కోసం నిర్మించిన భవనంలోనే కలెక్టర్ పరిపాలనను నిర్వహిస్తున్నారు. వాస్తవానికి ఈ వైటిసి భవనాన్ని కూడా వైసిపి ప్రభుత్వం నిర్మించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పాడేరు చివర కుమ్మరిపుట్టులో వైటిసి భవనం కోసం శంకుస్థాపన చేశారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సరికే వైటిసి నిర్మాణం పూర్తయ్యాయి.

2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పడింది. ఈ తరుణంలో అల్లూరి సీతారామరాజు పేరిట కొత్త జిల్లా ఏర్పడింది. దీంతో నూతన జిల్లాకు కలెక్టర్ కార్యాలయం తప్పనిసరి కావడంతో జిల్లా కేంద్రంలో ఉన్న వైటిసి భవనాన్నే తాత్కాలిక కలెక్టరేట్‌గా మార్చేశారు. సుమారు రెండేళ్ల నుంచి ఇక్కడి నుంచే కలెక్టర్ పరిపాలన నిర్వహిస్తున్నారు.

వైటిసి భవనంలో తాత్కాలికంగా కొనసాగుతున్న కలెక్టరేట్

కలెక్టరేట్ ముఖద్వారం

స్థల పరిశీలనతో సరి..

నూతన కలెక్టరేట్ నిర్మాణం కోసం పాడేరు మండలం చింతలవీది ప్రాంతంలో స్థలాన్ని అధికారులు పరిశీలించారు. పక్కా భవనాలతో నూతన కార్యాలయాన్ని నిర్మించాలనే సంకల్పంతో అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోనంకి గోపాలకృష్ణలు స్థలం ఎంపిక పూర్తి చేశారు. ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపించారు. అప్పటి వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణానికి ఒక్క రాయి కూడా వేయలేదు. దీంతో కొత్త జిల్లాకు కలెక్టర్ కార్యాలయం లేని పరిస్థితి ఏర్పడింది. కాగా, చింతలవీధి దగ్గరలో కలెక్టరేట్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలను పంపించిన తర్వాత ఒక్కసారిగా ఆ ప్రాంతంలో భూములకు భారీగా డిమాండ్ ఏర్పడింది. కలెక్టరేట్ ఏర్పాటు జరగలేదు గానీ భూముల ధరలకు మాత్రం రెక్కలు వచ్చాయని అక్కడి ప్రజలు చెబుతున్నారు.

ఇతర, అద్దె భవనాల్లో మరికొన్ని..

జిల్లాలో చాలా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. వైద్య, ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, జిల్లా రిజిస్ట్రేషన్, తదితర ప్రభుత్వ కార్యాలయాలు రెండేళ్లుగా ఇతర, అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ భవనాల్లో సరిపడా మౌలిక సౌకర్యాలు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు లేక పోవడం తో సంబంధిత అధికారులు, సిబ్బందితో పాటు. పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చింతలవీధి ప్రాంతంలో కలెక్టరేట్ కోసం పరిశీలించిన స్థలం ఇదే

అకృత్యంపై ప్రజాసంఘాల నిరసన

కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి: విఆర్.పురం: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా మండలం రేఖపల్లిలో సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం, ఐద్వా ఐద్వా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మౌనం పాటించి వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకుడు పూనెం సత్యనారాయణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ యావత్‌దేశాన్ని ఉలిక్కిపడేలా చేసేలా కోల్‌కత్తా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దేశంలో నిర్భయ, దిశ వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడంలో వైఫల్యంపై ఆవేదన వ్యక్తం చేశార. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొచ్చి మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా కళాశాలలు, పాఠశాలలు, హాస్టల్స్‌లో భద్రత మరింత పెంచాలని, నైట్‌వాచ్‌మెన్, ఎఎన్ఎంలను నియమించాలని కోరారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఐద్వా నాయకులు పూనేం సరోజిని, పంకు సత్తిబాబు, చిన్నమటపల్లి ఎంపిటిసి, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్, నాలారపు ప్రకాశరావు, గుండెపుడి లక్ష్మణరావు, వేటగాని సూరి, ఊయక .వికాస్, విద్యార్థినులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

రేపు విజయవాడలో రాష్ట్ర సదస్సుకు తరలిరండి

సిఐటియు రంపచోడవరం జిల్లా అధ్యక్షులు వాణిశ్రీ

ప్రజాశక్తి- రంపచోడవరం : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం గ్రామ, వార్డు వాలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకుని, రూ.పది వేలు వేతనాన్ని పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు రంపచోడవరం జిల్లా అధ్యక్షులు మట్ల.వాణిశ్రీ డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 20న విజయవాడ ఎంబి భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నావాలంటీర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో నిర్లక్ష్యం చూపడం సరికాదన్నారు. ప్రభుత్వం, అధికారులు నిర్దేశించిన బాధ్యతలను ప్రజలకు అత్యంత చేరువలో ఉంటూ సమర్థవంతంగా నిర్వహించిన వాలంటీర్లను, ఎన్నికల సమయంలో రెండు నెలలు పక్కన పెట్టారన్నారు. వాలంటీర్ల వ్యవస్థను తాము కొనసాగిస్తామని ఎన్నికలకు ముందు సిఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం వారిని విధుల్లో చేర్చుకోకుండా, మరిచిపోయినటుల వ్యవహరించడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియమితులయ్యారన్న విషయాన్ని పక్కనబెడితే, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు విజయవంతంగా అందించడంలో వాలంటీర్ల కృషి, అంకితభావాన్ని పరిగణనలోకి తీసుకుని, వారికి న్యాయం చేయాలని కోరారు. గ్రామ వాలంటీర్ల కొనసాగింపుపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాలంటీర్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఈ నెల 20న సిఐటియు ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు రంపచోడవరం డివిజన్‌లోని 11 మండలాల నుంచి పెద్దఎత్తున గ్రామ, వార్డు వాలంటీర్ల పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బొర్రా గుహలను తిలకిస్తున్న పర్యాటకులు

పర్యాటక కేంద్రాలు కిటకిట

ప్రజాశక్తి -అనంతగిరి: గత రెండు నెలలుగా వెలవెల బోయిన ప్రముఖ పర్యాటక కేంద్రాలు ఆదివారం కిటకిటలాడాయి. బొర్రా గుహలు, తాడిగుడ, కటికి, చిటంపాడు జలపాతలతో పాటు మర్దగుడ సాపరాయి, డమ్ముకు, సుంకరమెట్ట యూ పాయింట్‌లు పర్యాటకులతో కళకళలాడాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడం, శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో ఆ ప్రాంతమంతా పర్యాటకులతో కిటకిటలాడాయి. విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వేలాది మంది తరలి వచ్చారు. బొర్రా గుహల్లో విద్యుత్ కాంతాలను ఆశ్వాదించారు.అక్కడ పని చేస్తున్న గైడ్స్, సిబ్బందిలు పర్యాటకులకు వివరించారు. జలపాతాల్లో పిల్లాపాపలతో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. ఘాట్ రోడ్డు. యు పాయింట్‌లలో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. మర్దగుడ, బీసుపురం, సుంకరమట్ట, కాఫీ ప్లాంటేషన్ మెయిన్ రోడ్డు ఇరు వైపులలా ఉన్న స్వచ్ఛమైన కాపీ పౌడర్, ఇతర వస్తువులు కొనుగోలు చేశారు. అరకు ట్రైబుల్ మ్యూజియం, పద్మాపురం గార్డెన్, డుంమిరిగుడ, సాపరాయి వంటి ప్రాంతాలను తిలకిస్తూ సందడి చేశారు.

అనంతగిరిలో ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కొత్తకోట: కొత్తకోట గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ పర్ ప్యూర్ పీపుల్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మూడు వందల మంది వృద్ధులకు, అనాథలకు, బిక్షగాళ్లకు, వికలాంగులకు అన్నదానం నిర్వహించారు. కొత్తకోట నుంచి నర్సీపట్నం వరకు బిఎన్ రోడ్డులో ఆహారాన్ని పంపిణీ చేసారు. కొవ్వూరు, బొడ్డుపల్లి గ్రామాలలో వృద్ధాశ్రమాలలో నిరుపేద వృద్ధులకు ఆహారం అందించారు. ఈ సందర్భంగా సేవా సంఘం అధ్యక్షులు విరోతి ఆనంద్ మాట్లాడుతూ, తమ సంఘం ద్వారా ప్రతి నెల అనాథలకు, వికలాంగులకు, భిక్షాటన చేసే వారి ఆకలి తీర్చడమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కొప్పు శ్రీనివాసరావు, కార్యదర్శి జవాది రాజా, సభ్యులు నాగేశ్వరరావు, కొర్ర గణేష్, గుమ్మడి జగదీష్, ఆమిరెడ్డి గణేష్, కోట బాబీ, చిత్రాడ రాజు, బేతా భాస్కర్ రాజు, వెల్లంకి ప్రసాద్, గట్టా ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యాకమిటీ ఛైర్మన్లుగా సిపిఎం మద్దతుదారులు

కారం భవాని

పాండు బాలరాజు

సున్నం నాగేష్

పూసం సత్తిబాబు

బెల్లం నాగేశ్వరరావు

మానే బుజ్జి

ప్రజాశక్తి- విఆర్ పురం: మండలంలోని వివిధ పాఠశాలలకు జరిగిన పాఠశాల యాజమాన్యాల కమిటీల ఛైర్మన్లుగా సిపిఎం నేతలు ఎన్నికయ్యారు. చిన్నమట్టపల్లి పంచాయతీ సున్నంవారి గూడెం హాస్టల్ తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్‌గా పూసం. సత్తిబాబు ఎన్నికయ్యారు. రామవరం పంచాయతీ చొప్పల్లి పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా సున్నం. నాగేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు,

సోములగూడెం హాస్టల్ ఛైర్మన్‌గా పాండు బాలరాజు, కారం గుంపు పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా మానే బుజ్జి, కన్నాయిగూడెం పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా కారం భవానీ, వెంకన్నగూడెం పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్‌గా తెల్లం నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. వీరితోపాటు ముల్కనపల్లి, కుందులూరు రెండు పంచాయతీల్లో ఏడు పాఠశాలలు, జీడిగుప్పలో రెండు, శ్రీరామగిరి ఒకటి మొత్తంగా 17 పాఠశాలల యాజమాన్య కమిటీల ఛైర్మన్ స్థానాలను సిపిఎం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమను విద్యాకమిటీ ఛైర్మన్‌లుగా ఎన్నుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామన్నారు..

మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు

ప్రజాశక్తి -కొయ్యూరు : అల్లూరి జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్, పాడేరు ఎఎస్‌పి ధీరజ్ ఆదేశాల మేరకు కొయ్యూరు వారపుసంతలో ఆపరేషన్ పరివర్తనలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కొయ్యూరు సిఐ పివి. వెంకటరమణ, మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ సిబ్బందితో కలిసి కొయ్యూరు వారపుసంతలో కొయ్యూరు, బూదరాళ్ల పరిసర ప్రాంత ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐ వెంకటరమణ మాట్లాడుతూ, గంజాయి సాగు, రవాణా నేరమని తెలిసినా నేటికీ కొందరు డబ్బులకు ఆశపడి, ప్రలోభాలకు గురై నేరాలకు పాల్పడుతూ, పట్టుబడి జైలుపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి జోలికి వెళ్లి జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి నివారణకు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 93811 23100పై అవగాహన కల్పించారు. గంజాయి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయి పంటల వైపు గిరిజనులు దృష్టి పెట్టాలని, ప్రభుత్వపరంగా అందిస్తున్న ప్రోత్సాహకాలు, సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై సంతకు వచ్చిన వ్యాపారులు, గిరిజనులకు అవగాహన కల్పించారు.

వారపుసంతలో అవగాహన కల్పిస్తున్న సిఐ వెంకటరమణ

ఏజెన్సీ డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న రాజేశ్వరరావు

వేతన బిల్లుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఉపాధ్యాయ సంఘాల ప్రమేయం లేకుండా ఏజెన్సీలోని ఏడు మండలాల్లోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు వేతనాలు, ఇంక్రిమెంట్ల బిల్లులను మండల విద్యాశాఖ కార్యాలయంలోనే చేయాలని ట్రైబల్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వంతల చిన్నారావు, ఉపాధ్యక్షులు లవకుశ దొర, ప్రధాన కార్యదర్శి ఎం రాజేశ్వరరావు, యూనియన్ సభ్యులు కోరారు. ఈమేరకు ఏజెన్సీ డిఇఒను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. మండల, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయుల జీతాల బిల్లులను ఉమ్మడి జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ ప్రొసీడింగ్స్, జోన్- 2 కాకినాడ ఆదేశాల మేరకు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతోకాకుండా విద్యాశాఖాధికారి ద్వారా తయారుచేయాలని, తద్వారా వీటి తయారీలో వివక్ష, కొన్ని యూనియన్లకు ఇబ్బందులను తొలగించాలని కోరారు.

వరదల్లో నష్టపోయిన ఇళ్లకు పరిహారమివ్వాలి

మాట్లాడుతున్న సిపిఎం నేత సత్యనారాయణ

ప్రజాశక్తి-విఆర్ పురం: వరద నీటి ముంపులో కుంగిపోయిన, కూలిపోయిన ఇళ్లకు ప్రభుత్వపరంగా తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రేఖపల్లి పంచాయతీ సిపిఎం కార్యాలయంలో పులి సంతోష్‌కుమార్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ వరదల తీవ్రతకు పునరావాస కేంద్రాల్లో వర్షం, చీకటి, విషకీటకాలు, దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడిన వరద బాధితులకు వరద తెరిపినిచ్చిన తర్వాత సరైన వైద్యసేవలు అందించే పరిస్థితి లేకపోవడం దారుణమన్నారు. బాధిత గ్రామాల్లో వైద్యశిబిరాల ఏర్పాటులో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ముంపు బాధితులకు కేవలం రూ.మూడు వేలు సాయమిచ్చి చేతులు దులుపుకున్నారని, వరద ప్రభావంతో నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వం రూ.2వేలు సాయమిస్తే, ఇపుడు కూటమి ప్రభుత్వం రూ.మూడు వేలుఇచ్చిందని, అంతకుమించి, రెండూ దొందూదొందేనని ఆరోపించారు. వరదల్లో కూలిన ఇళ్లకు రూ.లక్ష, కుంగిపోయిన ఇళ్లకు రూ.50వేలు చొప్పున పరిహారం చెల్లించడంతోపాటు బాధితులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. వర్షాలు వరదలు వల్ల నష్టపోయిన పంటలు, ఇతర ఆస్తులపై సమగ్రసర్వే నిర్వహించి, బాధితులకు నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలని కోరారు. వర్షాలు, వాగుల ఉధృతి వల్ల కొట్టుకుపోయి, కోతకు గురైన కల్వర్టులు, రోడ్లకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని కోరారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం. చిన్నబాబు మండల నాయకులు పంకు. సత్తిబాబు, వడ్లది. రమేష్, కారం. సుందరయ్య, కొండారెడ్డి, తోడం. రాజు, నాయకులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి -సీలేరు: సీలేరులో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో వారపుసంతకు కొంచం ఇబ్బందులు ఏర్పడినా, ప్రజలు ఎండల తాపం నుంచి ఉపశమనం పొందారు. ఆదివారం ఉదయం నుంచి వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చి మబ్బులతో మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో రోడ్డు పక్కనే దుకాణాలు వేసుకున్న వారపుసంతకు కొంచం ఇబ్బంది ఏర్పడినా, ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. వర్షంతో వారపు సంతకు వచ్చిన చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. కొద్దిసేపువ్యాపారాలు నిలిచిపోయాయి. వర్షం వెలిసిపోయిన తర్వాత యథావిధిగా సంత కొనసాగింది. వర్షాం కారణంగా చీరాల పరిసర ప్రాంతాల్లో చల్లటి వాతావరణం నెలకొంది.

కార్మికులకు వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి- రోలుగుంట: పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుద్య కార్మికులు, వాచ్‌మేన్‌లకు జీతాలు చెల్లించాలని సీఐటీయు మండల నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. రోలుగుంటలో ఆదివారం మండలంలో పని చేస్తున్న పారిశుద్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకి పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని, ప్రతీ నెల వేతనాలు ఇచ్చేలాగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల పారిశుద్య కార్మికులకు, వాచ్‌మేన్‌లను ప్రభుత్వం ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. యూనిఫారం, భీమా సౌకర్యం కల్పించాలని, పని ఒత్తిడి తగ్గించాలని, సెలవులు కూడా ప్రకటించాలని కోరారు.

స్కూల్ కమిటీ చైర్మన్లకు సన్మానం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని పలు పాఠశాలల స్కూల్ కమిటీ చైర్మన్‌లను ఆదివారం తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ సన్మానించారు. నక్కపల్లిలో వెంకటేష్‌ను నూతనంగా ఎన్నికైన స్కూల్ కమిటీ చైర్మన్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వెంకటేష్ వారిని అభినందించి, శాలువాతో సత్కరించారు. స్కూల్ కమిటీ చైర్మన్‌లు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

నాతవరం: నాతవరం మండలం బొడ్డుపల్లి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కి చమ్మచింత గ్రామానికి చెందిన చిక్కాల సత్తిబాబు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చైర్మన్ గా ఎన్నికైన సత్తిబాబు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. పాఠశాల విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలిగినా తక్షణమే తీర్చడానికి కృషి చేస్తానన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి- కొత్తకోట: కొత్తకోట గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ పర్ ప్యూర్ పీపుల్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మూడు వందల మంది వృద్ధులకు, అనాధలకు, బిక్షగాళ్లకు, వికలాంగులకు అన్నదానం నిర్వహించారు. కొత్తకోట నుంచి నర్సీపట్నం వరకు బిఎన్ రోడ్డులో ఆహారాన్ని పంపిణీ చేసారు. కొవ్వూరు, బొడ్డుపల్లి గ్రామాలలో వృద్ధాశ్రమాలలో నిరుపేద వృద్ధులకు ఆహారం అందించారు. ఈ సందర్భంగా సేవా సంఘం అధ్యక్షులు విరోతి ఆనంద్ మాట్లాడుతూ, తమ సంఘం ద్వారా ప్రతి నెల అనాధలకు, వికలాంగులకు, భిక్షాటన చేసే వారి ఆకలి తీర్చడమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కొప్పు శ్రీనివాసరావు, కార్యదర్శి జవాది రాజా, సభ్యులు నాగేశ్వరరావు, కొర్ర గణేష్, గుమ్మడి జగదీష్, ఆమిరెడ్డి గణేష్, కోట బాబీ, చిత్రాడ రాజు, బేతా భాస్కర్ రాజు, వెల్లంకి ప్రసాద్, గట్టా ఈశ్వరరావు పాల్గొన్నారు.

చెక్కతో రాఖీ ప్రతిరూపం

అక్షర నమూనాలను చెక్కిన సూక్ష్మ కళాకారుడు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, కార్పెంటర్ దార్ల రవి సోమవారం నాడు రాఖీ పౌర్ణమి సందర్భంగా తన సూక్ష్మ కళతో సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపాడు. చెక్కతో రాఖీ అక్షరమాలలో రాఖీ, స్వీట్స్, దీపం, గిఫ్ట్ లను చెక్కి తన సూక్ష్మ కళను ప్రదర్శించాడు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి- గొలుగొండ: గొలుగొండ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో ఆదివారం చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. గ్రంథాలయాధికారి మట్లాడుతూ, విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్ సిఐ హరి బదిలీ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి మన్యం పార్వతీపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన సంవత్సరం క్రితం సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అనేక కీలకమైన కేసులను పరిష్కరించారు. ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎన్నికలను బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఉన్నతాధికారుల ప్రసంశలు అందుకున్నారు.

చెల్లించని బిల్లులు.. అప్పగించని భవనాలు

▸▸అద్దెకొంపల్లో అంగన్‌వాడీ కేంద్రం, సబ్ సెంటర్ నిర్వహణ

▸▸కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

అద్దె కొంపలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

నిర్మించినా అప్పగించని అంగన్‌వాడీ భవనం

ప్రజాశక్తి -అనంతగిరి: మండల కేంద్రంలోని బొడ్డచెట్టు కాలనీ వద్ద అంగనవాడీ, హెల్త్ సబ్ సెంటర్ భవనాల పనులు పూర్తయ్యాయి. అయితే ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు ఆ భవనాలు తిరిగి వినియోగానికి నోచుకోలేదు. దీంతో, అంగన్వాడి, సబ్‌సెంటర్‌ల నిర్వహణను అద్దె కొంపలో కొనసాగించవలసిన పరిస్థితి ఏర్పడింది. భవనాల నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం 2018, 19 సంవత్సరంలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ రూ.13 లక్షలు హెల్త్ సబ్ సెంటర్‌కు, అలాగే అంగనవాడి భవనం నిర్మాణానికి పిఆర్ శాఖ రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. గుత్తేదారుడు అదే సంవత్సరంలో రెండు భవనాలు కూడా పనులు పూర్తి చేశారు.

ఇది ఇలా ఉండగా అంగన్వాడి 1 కేంద్రంలో పెద్దూరు, బొడ్డ చెట్టు కొలనీ, తహశీల్దార్ కార్యాలయ వీధి 50 మంది పైగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ఉన్నారు. బొడ్డచెట్టు కాలనీలో అద్దె కొంపలో నిర్వాహకులు కొనసాగిస్తున్నారు. దీంతో, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇది ఇలా ఉండగా సబ్ సెంటర్ భవనం పరిస్థితి కూడా అలానే ఉంది. పనులు పూర్తయినప్పటికీ కూడా గుత్తేదారుడుకు చెల్లించవలసిన బిల్లులు చెల్లించక పోవడంతో ఆ భవనాలను సంబంధిత డిపార్ట్మెంట్‌కు అప్పగించలేదు. దీంతో, ఏళ్ళు గడిచిపోతున్నా.. ఆ భవనాలు నిరుపయోగంగానే ఉన్నాయి. దీంతో బీటలు బారుతున్నాయి. నూతన కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బిల్లులు చెల్లించి ఆ భవనాలను అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న సబ్ సెంటర్

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ నేతలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : అంగన్వాడీల వేతనాలు సకాలంలో చెల్లించి, సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడి మండల కార్యదర్శి ఈశ్వరమ్మ కోరారు. అంగన్‌వాడీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీలను పరిష్కరించి ప్రతి నెలా మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎన్‌డిఏ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నెల నుండి నేటి వరకు అంగన్వాడీల జీతాలు బకాయి పడ్డాయన్నారు.

చాలీచాలని వేతనాలతో అంగన్వాడీలు వెట్టి చాకిరి చేస్తూ జీవనాన్ని గడుపుతున్నామన్నారు. బకాయిపడ్డ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొర్ర శంకర్రావు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. అంగన్వాడీలు 42 రోజుల నిరవధిక సమ్మెలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వంపై డిమాండ్ చేశారు. వేతనాలు పెంచి, గ్రాట్యూటీ అమలు చేసి, అంగన్వాడీలపై పని భారం తగ్గించాలన్నారు. ఈ సమావేశంలో అంగన్వాడి యూనియన్ మండల అధ్యక్షులు మౌలమ్మ, ఉపాధ్యక్షురాలు వి.సత్యవతి, అంగన్వాడీలు పార్వతి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొర్ర శంకర్రావు, మండల అధ్యక్షుడు కీముడు సత్తిబాబులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఎస్‌బిఐ ఎటిఎంలో చోరీ

ప్రజాశక్తి-పెందుర్తి: జివిఎంసి 96వ వార్డు పెందుర్తి కూడలి సమీపంలో నటరాజ్ థియేటర్ పక్కన ఉన్న ఎస్‌బిఐ ఎటిఎమ్‌ను పగులగొట్టి సుమారు రూ.19 లక్షలు చోరీకి దుండగులు పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న క్రైమ్ ఎసిపి- 2 శ్యామలరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దొంగల మొఖం కనపడకుండా సీసీ కెమెరాలకు నల్ల స్ప్రే కొట్టారని, డివిఆర్ బాక్సుల కనెక్షన్ పూర్తిగా తొలగించిన పట్టుకుపోయారని తెలిపారు. క్లూస్ టీం ఆధారంగా విచారణ చేపట్టామని తెలిపారు. ఈ దొంగతనంలో నలుగురు నుంచి ఐదుగురు ఉండి ఉంటారని అంచనా వేస్తున్నామన్నారు. దొంగతనానికి పాల్పడిన వారు ఇతర రాష్ట్రాలకు చెందిన వారిగా అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీచ్‌లో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి గొల్లల తిమ్మాపురం ప్రైవేట్ రెస్టారెంట్ ఎదురుగా బీచ్ ఒడ్డున సుమారు 30 నుంచి 40 ఏళ్లు ఉన్న వ్యక్తి మృతదేహం ఆదివారం పోలీసులకు లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం... ఆదివారం ఉదయం 6.30 గంటలకు నడకకు వెళ్తూ కొమ్మాదికి చెందిన రఘురామ్‌కు గుర్తు తెలియని మృత దేహం కనబడింది. ఆయన విఆర్‌ఒకు సమాచారం అందించగా, విఆర్‌ఒ అఖిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడు నల్లటి షాట్, ఎరుపు, నలుపు రంగు బనియన్ ధరించి ఉన్నాడు. అతని కళ్ళు గుంతలు పడి ఉన్నాయి. విఆర్‌ఒ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పైడిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దొంగతనాల కేసులో పాత నేరస్తుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దొంగతనాల కేసులో పాత నేరస్తుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ కేసు వివరాలను విశాఖపట్నం క్రైమ్ డిసిపి పి.వెంకటరత్నం ఆదివారం ఉదయం విశాఖపట్నం కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ ఏడాది మే 25 రాత్రి కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని మురళీనగర్‌కు చెందిన గొట్టిపాటి రఘురాం ఇంట్లో రాత్రివేళ దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి బీరువా తెరిచి 25 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించాడు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసు ప్రత్యేక బృందాలు గాలించాయి. షీలానగర్ సమీపంలోని గవర జగ్గయ్యపాలెంలో నివసిస్తున్న బాలబోయిన రమేష్‌తోపాటు అదే ఇంటిలో అద్దెకు ఉంటున్న రఘునాథ్‌ను ఈ కేసులో అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో వారే దొంగతనం చేసినట్టు నిర్ధారణ అయింది. ప్రధాన నిందితుడు బాలబోయిన రమేష్ గతంలో విశాఖ నగరంతో పాటు గుంటూరు, కృష్ణా, ఒంగోలు ఏరియాలలో రాత్రిపూట తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డాడు. గతంలో 13 కేసులలో జైలుకు వెళ్లి వచ్చాడు. విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలోని కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో నాలుగు, ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక్కో దొంగతనం కేసులో ఆయన నిందితుడిగా ఉన్నాడు. ఆయన నుంచి రూ.7.4 లక్షల విలువగల 77 గ్రాముల బంగారం, రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయ ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాల అనంతరం బంగారాన్ని తెలిసిన వ్యక్తుల ద్వారా విక్రయించి ఆ డబ్బుతో గోవా వంటి విలాసవంతమైన ప్రదేశాలకు వెళ్లి రమేష్ జల్సాలు చేస్తుండేవాడు.

ఇసుక వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల సరిహద్దు గ్రామమైన పందూరు వరాహనది సమీపం నుండి నిత్యం రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుండటంతో పోలీసులు స్పందించి శనివారం రాత్రి నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పందూరు శివారు ఇందేసమ్మవాకలో రెండు ఇసుక ట్రాక్టర్లను, పందూరు పంచాయతీ పరిధిలో గూడెపులోవ వద్ద ఒక లారీని పట్టుకొని స్థానిక ఏఎస్‌ఐ గంగరాజు స్టేషన్ కు తరలించారు. పట్టుపడ్డ వాహనాలకు ట్రాక్టర్కు 5000 చొప్పున, లారీకి 10000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఈఎస్‌ఐ గంగరాజు మాట్లాడుతూ, అక్రమ ఇసుక రవాణా చేపడితే ఉపేక్షించేది లేదని తెలిపారు.

జ్యోతి ప్రజ్వలన చేసి ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎన్నేళ్లు గడిచినా ఫొటోలు సజీవ జ్ఞాపకాలుగా నిలవడమే కాకుండా సాక్ష్యాలుగా పదిలంగా ఉంటాయని విజయ మెడికల్ సెంటర్ అధినేత డాక్టర్ సుమన్ కలగర అన్నారు. వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆంధ్రా యూనివర్సిటీ హిందీ భవన్ సెమినార్ హాల్‌లో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫొటోగ్రఫీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయని, దానికి తగ్గట్టుగా ఫొటోగ్రాఫర్లు తమ నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుంటున్నారని అన్నారు. క్లబ్ అధ్యక్షులు పిఎన్. సేతు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీనియర్ ఫొటో జర్నలిస్టు సిహెచ్.సత్యనారాయణకు డాక్టర్ పల్లా రాజారావు జీవిత సాఫల్య పురస్కారం, సీనియర్ ఫొటోగ్రాఫర్ టివివి.సత్యారావు బాబ్జీకి బండి వెంకట రమణారావు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి, సీనియర్ ఫొటో జర్నలిస్టు ఎమ్‌వి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఉత్సాహం కలిగిన ఫొటోగ్రాఫర్లకు మెళుకువలు నేర్పి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే విధంగా క్లబ్ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ఫొటో అవార్డు గ్రహీత కొర్లపాటి సరస్వతిరావును, వి డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కెఎమ్‌కె.రమేష్‌లను సత్కరించారు. తొలుత ఫొటో ఎగ్జిబిషన్‌ను డాక్టర్ సుమన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చెన్నయ్, హైదరాబాద్, కాకినాడ, విశాఖపట్నంలకు చెందిన పలువురు ఆర్ట్ ఫొటోగ్రాఫర్లు తీసిన అద్భుత ఛాయాచిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ ప్రదర్శనను అధిక సంఖ్యలో తిలకించారు. ఈ కార్యక్రమంలో వి.వేణుగోపాల్‌రావు, బండి ప్రసాద్, అయోధ్య మురిగేష్, ఎస్. రాము, ఎస్.శ్రీనివాస్‌రావు, వి.గిరీష్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న ముగింపు సభలో సఖీభవ అధినేత కృష్ణ మూర్తి, ఎయు ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నర్సింహారావు పాల్గొని ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లకు సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లను దారి మళ్లించినట్టు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు 22643 ఎర్నాకుళం - పాట్నా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు సెప్టెంబర్ 2, 9, 16, 23 తేదీల్లోనూ, 12509 ఎస్ఎంవి బెంగళూరు - గౌహతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 4, 6, 11, 13, 18, 20, 25, 27 తేదీల్లోనూ, 11019 సిఎస్‌టి ముంబయి - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 2, 4, 6, 7, 9, 11, 13, 14, 16, 18, 20, 21, 23, 25, 27, 29 తేదీల్లోనూ సాధారణ మార్గమైన ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా కాకుండా మళ్లించిన మార్గమైన విజయవాడ - గుడివాడ - భీమవరం టౌన్ - నిడదవోలు మీదుగా ప్రయాణిస్తాయి. 13351 ధన్‌బాద్ - అలెప్పీ బొకారో ఎక్స్ ప్రెస్ సెప్టెంబర్ 2 నుంచి 29 వరకు, 18111 టాటా - యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 5, 12, 19, 26, తేదీల్లోనూ, 12376 జసిదిహ్ - తాంబరం ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 4, 11, 18, 25 తేదీల్లోనూ, 22837 హతియా - ఎర్నాకుళం ఎసి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 2, 9, 16, 23 తేదీల్లోనూ, 18637 హతియా - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 7, 14, 21, 28 తేదీల్లోనూ, 12835 హతియా - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 3, 8, 10, 15, 17, 22, 24, 29 తేదీల్లోనూ, 12889 టాటానగర్ - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 6, 13, 20, 27 తేదీల్లోనూ సాధారణ మార్గమైన నిడవోలు - తాడేపల్లిగూడెం - ఏలూరు మీదుగా కాకుండా మళ్లించిన మార్గమైన నిడదవోలు - భీమవరం టౌన్ - గుడివాడ - విజయవాడ మీదుగా ప్రయాణిస్తాయి. కావున ఆ రైళ్లు పైన తెలిపిన తేదీల్లో తాడేపల్లిగూడెం, ఏలూరు స్టేషన్ల మీదుగా ప్రయాణించవు

ఎవరొచ్చినా అంతే..!

కొనసాగుతున్న డిప్యుటేషన్లు

గురువులకు బోధనేతర పనులు

పాఠాలు చెప్పేవారులేక పిల్లల అవస్థలు

గత సర్కారు దారిలోనే కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులను బోధనేతర పనుల్లో ప్రభుత్వం నియమిస్తోంది. కొంతమంది ఉపాధ్యాయులు తమ సౌలభ్యం కోసం బోధనేతర పనులపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వమేదైనా పిల్లలకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులను బోధనేతర పనులకు డిప్యుటేషన్‌పై నియమించకూడదన్న నియమాన్ని పాటించడంలేదు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు మొదలుకొని ఉన్నత పాఠశాలల్లోని సబ్జెక్టు టీచర్ల వరకు తాము పనిచేయాల్సిన దూర ప్రాంతానికి వెళ్లకుండా నివాస చోటుకు దగ్గరగా, తనకు నచ్చిన చోట పనిచేయడానికి తమ పలుకుబడి, పరపతిని ఉపయోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు పాఠాలు చెప్పి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువులను డిప్యుటేషన్‌పై బోధనేతర పనుల్లో ప్రభుత్వం నియమించి పిల్లలకు అన్యాయం చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యా సంబంధిత కార్యాలయాల్లోని ఖాళీలను అర్హత కలిగిన ఇతరులతో భర్తీచేయకుండా పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులకు డిప్యుటేషన్‌పై విద్యా సంబంధిత కార్యాలయాల్లో బోధనేతర పనులను ప్రభుత్వం అప్పగిస్తోంది. దీంతో పలువురు ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారు. ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్లు 22 మందిని భీమిలిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నియమిస్తూ గత ప్రభుత్వం 2023 జూన్ 20న జారీచేసిన ఉత్తర్వులను ఈ ప్రభుత్వం కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. బోధనకు ప్రాధాన్యత ఇస్తామన్న కూటమి ప్రభుత్వం బోధనేతర బాధ్యతల్లోవున్న ఉపాధ్యాయులను వెనక్కు రప్పించి బోధన పనులు అప్పగించడానికి చొరవచూపడంలేదు.

సమగ్ర శిక్షా అభియాన్, డిఇఒ కార్యాలయం, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో డిప్యుటేషన్‌పై వివిధ స్థాయిల్లో పలువురు బోధనేతర పనులు చేస్తున్నారు. మునగపాక మండలం పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో డిప్యుటేషన్‌పై బోధనేతర పనిచేస్తున్నారు. ఎస్.రాయవరం, రాంబిల్లి మండలాల్లో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు అనకాపల్లి ఎస్ఎస్ఎ కార్యాలయంలో పనిచేస్తున్నారు. చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దాదాపు ఐదేళ్లుగా విశాఖపట్నం డిఇఒ కార్యాలయంలో పనిచేస్తున్నారు. పద్మనాభం మండలంలోని ఓ ఉపాధ్యాయుడు విశాఖపట్నం డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డులో సుమారు నాలుగేళ్లుగా పనిచేస్తున్నారు. ఆయనపై ఉపాధ్యాయ సంఘాలు ఫిర్యాదుచేయడంతో అతిథిలా అప్పుడప్పుడూ స్కూల్‌కు వెళ్తున్నారు. డిఇఒ కార్యాలయంలో ఎక్కువ రోజులు గడుపుతున్నారు. డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులు వెళ్లిన పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులు సర్దుబాటు చేసుకొని పాఠాలు బోధిస్తున్నా, ఉపాధ్యాయుల కొరత వున్న పాఠశాలల్లో పాఠాలు బోధించేవారు లేక పిల్లలు అవస్థలుపడుతున్నారు.

ఉపాధ్యాయుడు కానరాని ఓ పాఠశాల (ఫైల్‌ఫొటో)

భీమిలి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏజెన్సీలోని చింతపల్లి మండలం కృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాల, మెరకులు, లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల, డుంబ్రిగుడ మండలం లైగండ, జోడిగుడ ప్రాథమిక పాఠశాల, కోటవురట్ల మండలం పాములవాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పరవాడ మండలం పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదమడక ప్రాథమిక పాఠశాల, భీమిలి మండలం కాపులుప్పాడ, కె.దిబ్బిడిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల, ఆనందపురం మండలం పాలవలస ప్రాథమికోన్నత పాఠశాల, వేములవలస ప్రాథమిక పాఠశాల, అనకాపల్లి మండలం కె.కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మెట్టపాలెం ప్రాథమిక పాఠశాల, రాంబిల్లి మండలం వెల్చురు ప్రాథమిక పాఠశాల, మాకవరపాలెం మండలం వెంకయ్యపాలెం ప్రాథమిక పాఠశాల, జివిఎంసిలోని చెంగలరావుపేట జివిఎంసి ప్రాథమిక పాఠశాల, నక్కపల్లి మండలం రాజయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్.రాయవరం మండలం సోముదేవపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, నాతవరం మండలం ఎన్‌డి సైట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెందుర్తి మండలం రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వులను కాదని డిప్యుటేషన్లను రద్దుచేసి బోధన పనులు అప్పగించలేమని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

కొంపముంచిన తుమ్ములు!

- అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి-ఎటపాక : భద్రాచలం నుండి అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుకు వెళుతున్న పాడేరు డిపో ఆర్‌టిసి బస్సు ఆదివారం ఉదయం ఎటపాక మండలం చోడవరం సమీపంలో జాతీయ రహదారిపై అదుపుతప్పి రోడ్డుకు కుడివైపునున్న పొలాల్లోకి దూసుకెళ్లింది.కాగా బస్సు డ్రైవర్‌కు ఆపుకోలేని తుమ్ములు రావడంతో వాటిని కంట్రోల్ చేసుకోలేక పోవడంతో బస్సు స్టీరింగ్ పట్టుతప్పి రోడ్డు పక్కకు వెళ్లిందని డ్రైవర్ చెప్పినట్టుగా స్థానికులు చెప్తున్నారు. అయితే ఘటన సమయంలో ఎదురుగా, వెనుక నుంచి ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెద్దప్రమాదమే తప్పిందని బస్సులోని ప్రయాణీకులు అంటున్నారు.

తుప్పల్లోకి దూసుకెళ్లిన బస్సు

పలువురు డిఎస్‌పిలు బదిలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పలువురు డిఎస్‌పిలను బదిలీ చేస్తూ డిజిపి సిహెచ్.ద్వారకా తిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు విశాఖపట్నం ఉమెన్ పోలీస్ స్టేషన్ డిఎస్‌పిగా పనిచేస్తున్న సిహెచ్.వివేకానందను శ్రీకాకుళం స్పెషల్ సబ్ డివిజన్‌కు, విశాఖపట్నం నార్త్ ఎసిపిగా పనిచేస్తున్న బి.సునీల్‌ను విజయవాడలోని కేంద్ర కార్యాలయానికి, శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచి డిఎస్‌పిగా పనిచేస్తున్న ఎ.త్రినాథరావును విశాఖపట్నం రైల్వే పోలీస్ విభాగానికి, విశాఖపట్నం రైల్వే పోలీస్ విభాగంలో పనిచేస్తున్న బి.మోహన్‌రావును కాకినాడలోని మూడో బెటాలియన్ ఎపిఎస్‌పికి, ఇంటిలిజెంట్ డిఎస్‌పిగా పనిచేస్తున్న ఎం.శ్రావణిని అనకాపల్లి సబ్ డివిజన్‌కు, అనకాపల్లి సబ్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.అప్పలరాజును విజయవాడలోని కేంద్ర కార్యాలయానికి, అదేవిధంగా సిఐడి డిఎస్‌పిగా పనిచేస్తున్న సిహెచ్.పెంటారావును విశాఖపట్నం వుమెన్ పోలీస్ స్టేషన్‌కు, ఏలూరు డిటిసిగా పని చేస్తున్న కె.ప్రభాకర్‌ను సిటీ స్పెషల్ బ్రాంచ్ ఎసిపిగా, విశాఖపట్నం సిటీ స్పెషల్ బ్రాంచ్ ఎసిపిగా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావును అనకాపల్లి డిటిసి డిఎస్‌పిగా, విశాఖపట్నం హార్బర్ ఎసిపిగా పనిచేస్తున్న బి.మోసెస్‌పాల్‌ను విజయవాడ కేంద్ర కార్యాలయానికి బదిలీ చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా జమాల్‌ఖాన్

ప్రజాశక్తి-కూనవరం: ఇనుపమేకు గుచ్చుకుని గాయమై, కుడి కాలును కోల్పోయిన మండలంలోని పైడిగూడెం గ్రామానికి చెందిన బత్తుల కొమరయ్య అనే నిరుపేద కుటుంబానికి ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ జమాల్‌ఖాన్ తన జెకెసి ట్రస్ట్ ద్వారా చేదోడుగా నిలిచారు. కూలిపనితో కుటుంబపోషణ సాగిస్తున్న కొమరయ్య కాలు కోల్పోవడంతో పనికి వెళ్లలేని పరిస్థితిలో ఆయన దుస్థితిని తెలుసుకున్న డాక్టర్ జమాల్‌ఖాన్, పైడిగూడెంలో కొమరయ్య ఇంటికి చేరుకుని బాధితుడిని ఓదార్చాడు. ఒంటికాలితో కొమరయ్య పడుతున్న కష్టాన్ని చూసి,జైపూర్ నుంచి కృత్రిమ కాలును తెప్పించి అమర్చడం ద్వారా బాధితుడు నడిచేలా చేస్తానని భరోసానిచ్చాడు.

కాలులేక పనికి వెళ్లలేని స్థితిలో కొమరయ్య కుటుంబం పడుతున్న ఇబ్బందులను చూసి, వారి జీవనభృతికి జెకెసి ట్రస్ట్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కొమరయ్య పిల్లలను హాస్టల్‌లో చేర్పించి చదివిస్తానన్నారు. తక్షణసాయంగా రూ.ఐదు వేలు నగదును అందించారు. తమ కుటుంబానికి మనోధైర్యాన్ని ఇచ్చి అండగా నిలిచిన డాక్టర్ జమాల్‌ఖాన్‌కు బాధిత కుటుంబం ధన్యవాదాలు తెలిపింది.కార్యక్రమంలో మడివి అప్పారావు, సూఫీ, ఎడవల్లి భాస్కర్, ఉమామహేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు ఎస్‌కె. షాజహాన్, రియాజ్, నటరాజ్, షారుక్ పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యవసరాల తరణ

విఆర్.పురం: మండలంలోని రాజపేట పంచాయతీ రాజుపేట కాలనీ, ఎస్‌సి కాలనీల్లో ఆయుర్వేద వైద్యులు, జెకె సిటీ చైర్మన్ జమాల్‌ఖాన్ సందర్శించారు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దళితవాడలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను డాక్టర్ ఖాన్ దృష్టికి తేగా, సొంత నిధులతో బోరు వేయిస్తానని హామీనిచ్చారు. అనంతరం ఎస్‌సి కాలనీలో ముయ్యేటి ఏసమ్మ, ఇసంపల్లి సమ్మక్కలకు, రాజుపేట కాలనీలో ముంజపు సరస్వతికి తన ట్రస్ట్ తరపున పది కేజీల బియ్యం కిట్లను అందజేశారు. రాజుపేట కాలనీలో వృద్ధురాలి, సుబ్రహ్మణ్యం అనే రోగికి చెరో రూ.2500 ఆర్థికసాయం అందజేశారు. హైస్కూల్‌ను సందర్శించి, వంటషెడ్ లేక భోజన తయారికి పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తేగా, తన సొంత నిధులతో వంటషెడ్ కట్టిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, సిద్ధు, గ్రామ పెద్దలు సరఫరాజ్ అలీ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఆదివారం స్థానిక సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.. డాక్టర్లు టివి. సుబ్బారావు, దాసరి ఉమామహేష్. ఎస్.సంపత్‌కుమార్ పాల్గొని 160మంది రోగులకు వైద్యసేవలు అందించారు. వీరిలో 61మందికి రక్తపరీక్షలు, ఎనిమిది మందికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి, ఫిజియోథెరపీ, ఆరుగురికి ఎక్స్‌రేలు చేసినట్లు , స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్యశిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ బిఆర్ఎస్.శ్రీకాంత్ , దాసరి పెద్ద అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు. వైద్యశిబిరంలో పాల్గొన్న రోగులకు, వారి సహాయకులకు భోజన సదుపాయం సమకూర్చినట్లు స్వామీజీ తెలిపారు.